**మనిషి** తన ఆత్మను వెలికి తీసి అరచేతిలో ఉంచుకొని చూపుకోవాలనే క్షణం అప్పుడప్పుడు వస్తూంటుంది. తాను నిర్లిప్తుడుగా ఉండి, అందరికి బాహాటంగా చూపాలని కూడా అనుకొంటాడు. ఆ క్షణంలో సంకోచం తాలూకు అడ్డుగోడలు విరిగిపోతాయి. సిగ్గుతెర తొలగిపోతుంది.

డిసెంబరు నెల. ఎముకలు కొరికే చలి. మధ్యాహ్నం మూడు గంటలు—వర్షం కురిసింది. రెండవ అంతస్తులో ఉండిపోయిన సిమెంటు నేలమీద వారిద్దరూ ఒకే కంబళిలో పడుకొన్నారు. తలకు, కాళ్ళకు గోడలు తగులుతున్నాయి. చినిగిపోయిన ఆ కంబళి రంధ్రాలను నేర్పుగా కప్పి పడుకొన్నారు.

వాళ్ళిద్దరు స్నేహితులు. ఒకే ఆఫీసులో పని. ఒకే గదిలో, ఒకే పరుపుమీద, ఒకే కంబళిలో పడుకొంటారు. ఇద్దరిది సామాన్యమైన చదువు. ఇద్దరూ చెప్పు లరిగేలా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి చుట్టూ తిరిగి ఎనిమిది నెలల ఉద్యోగం సంపాదించుకొన్నారు. ఇది అయిదవ నెల. మూడు నెలల తరవాత మళ్ళీ రోడ్డుమీద ఉంటారు. తరవాత మూడు, నాలుగు నెలల ఉద్యోగం. సంవత్సరాలుగా ఇదే వరస.

ఆఫీసులో పని చేయడం, సాయంత్రం థియేటర్‌లో సినిమా పోస్టర్లు చూడడం, చౌక రకం హోటల్లో భోజనం చేయడం, చిరిగిపోయిన కంబళిలో పడుకోవడం—రోజూ ఇదే కార్యక్రమం వారిది. కొత్త ఖరీదైన కంబళి కొనలేరా? కొనగలరు. కాని, మనసొప్పదు. ఇంతకంటే మంచి గదిలో ఉండనూగలరు. కాని, ఈ మురికి కూపాన్ని వదలలేరు. ఈ మురికి, పెచ్చులూడిన గది, దోమలు—ఇవే వారికి బాగుంటాయి. నల్లులున్న పరుపుమీద పడుకోవడం వారికి సుఖం, గర్వం. మురికిని, దరిద్రాన్ని గర్వంగా తలమీద ధరించి తిరుగుతారు, కిరీటం ధరించినట్టు.

గాలి తీవ్రతవల్ల కిటికీ రెక్కలు తెరుచుకొన్నాయి. అడ్డుగా పెట్టిన ఇటుక పడిపోయింది. కత్తిలాంటి గాలి కంబళిని చీల్చివేసింది.

“ఛత్! వెధవ గాలి. మళ్ళీ ఇటుక పెట్టవోయ్.” గోవింద్ పడుకొనే అన్నాడు.


“బాప్‌రే! ఈ చల్లగాలిలో లేవడం నా వల్లకాదు. గంటకు కాని మళ్ళా శరీరం వెచ్చగా ఉండదు.” రామేశ్వర్ అన్నాడు.

గోవింద్ వాడిని బతిమాలాడు. “నేను వెచ్చచేస్తా. నన్ను కావలించుకొని పడుకో. కిటికీ తెరిచే ఉంటే న్యూమోనియాతో ఇద్దరం చస్తాం.”

ఇంటి యజమానిని తిడుతూ రామేశ్వర్ లేచాడు. “వెధవ! ప్రతి నెల బాడుగ లాక్కొంటాడు. కాని, బోల్టు పెట్టాలన్న బుద్ధి లేదు.”

“ఈసారి రానీ—చెప్పుతో కొట్టి తరిమేస్తాను.” ఇటుక అడ్డుపెట్టి వణుకుతూ కంబళిలో దూరాడు.

చాలాసేపు ఇద్దరూ మౌనంగా ఉన్నారు. ఏమిటో ఆలోచిస్తూ పడుకొన్నారు. “ఇది కూడా ఒక బ్రతుకేనా?” ఇద్దరి నోటినుండి ఒకేసారి



వచ్చింది. మళ్ళా మౌనం. ఆ రాత్రి ఇద్దరి బాధలు ఒక్కుమ్మడిగా పైకి వచ్చాయి. నిర్లక్ష్యంగా అణిచివేసిన వారి దుర్దశ ఒక్కసారి ఎదుట నిలిచింది.

గోవిందు అన్నాడు:

"నేనెంత దుఃఖమనుభవించానో నీకు తెలియదు. మెట్రిక్ పాసయ్యాను. నాన్న జబ్బు పడ్డారు. ఆయన చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఆయన బతకాలనుకొన్నారు. కాని, ఎలా బతుకుతారు? ఆధారం ఏది? మందు మాకులకు డబ్బెక్కడ? ఆయన వాడిపోయిన ముఖం, నిరాశతో నిండిన కళ్ళు ఇప్పటికీ నా కళ్ళముందరే ఉంటాయి. రోగిష్టి అయిన ఏ వృద్ధుణ్ణి చూసినా నాకు మా నాన్న ముఖం గుర్తుకు వస్తుంది. ఒక్కసారి ఏడ్చేస్తా." గోవింద్ కంఠం రుద్ధమైంది. కొంచెం ఆగి అన్నాడు:

"చనిపోయేముందు మా నాన్న కళ్ళలో నిరాశ. 'నాయనా! నేను మీకోసం బతకాలనుకొన్నాను. కాని, నాకు మృత్యువుతో పోరాడే శక్తి లేదు'— అన్నట్టు ఉంటుంది ఆయన ముఖం. ఏమీ చేయలేని బేలతనం.

"తరవాత మేము ఉపవాసాలు చేస్తూ ఉండిపోయాం. అమ్మ ఇంట్లో ఉన్న కొన్ని పాత్రలు అమ్మింది. దానితో కొద్ది రోజులు కడుపులు నిండాయి. నేను ఉద్యోగం వెదుకుతూనే ఉన్నా. రైల్వే ప్లాట్‌ఫారం మీద ఇరవై నాలుగు గంటలు గడిపేవాణ్ణి, ఆకలితో. చివరికి ఆకలి భరించలేక హోటల్లో పూరీలు దొంగతనం చేశాను. తన్నులు తిన్నాను. తింటూనే పూరీలు తిన్నాను."

రామేశ్వర్ అడ్డుపడ్డాడు. "వదిలెయ్! ఇది మన పాత ఏడుపేగా? వేరే విషయం చెప్పు."

గోవింద్ బాధపడుతూ అన్నాడు: "నా దగ్గర ఇంకేముంటుంది? ప్రేమ విషయాలు చెప్పమంటావా? ఆకలినుండి తప్పించుకోవడానికే ప్రతి క్షణం ప్రయత్నించేవాడికి ప్రేమించేందుకు తీరిక ఎక్కడుంది? నీకు తెలియదు—నీ కెప్పుడైనా దుఃఖం కలిగితే కదా! తమ్ముడు, చెల్లెలు ఒకరి తరవాత ఒకరు మందు లేక చనిపోవడం ఈ కళ్ళతో చూస్తూ కూడా ఏమీ చేయలేకపోయాను. ఇప్పుడు అమ్మ, ఒక చెల్లి ఉన్నారు. నా ఉద్యోగం నిలకడ లేనిది. చెల్లెలు పెద్దదైంది. దాని భయంవల్ల ఇంటికి వెళ్ళడం లేదు. దాన్ని చూస్తే గుండెలో అగ్గి పోసినట్టు ఉంటుంది. అది అత్తవారి ఇంట్లో ఉండవలసిన సమయం ఇది. కాని, డబ్బు లేకుండా ఎవరు పెళ్ళాడుతారు దాన్ని? మూడు నెలలో ఉద్యోగం ఊడుతుంది. ఏ ముఖం పెట్టుకొని ఇంటికి వెడతాను?"

గోవింద్ కళ్ళు చెమ్మగిల్లాయి. "ఈ బతుకుకన్నా మరణం మంచిది." దుఃఖాన్ని ఆపుకోలేక గోవింద్ రామేశ్వర్‌ను చుట్టుకొనిపోయాడు.

రామేశ్వర్ రాయి అయిపోయాడు. కదలలేదు. మెదలలేదు. సానుభూతిగా స్నేహితుడిమీద చెయ్యి వేయలేదు. గోవింద్ మనసు రామేశ్వర్ ఆధారం కోరుతూ ఉంది. గోవింద్‌కు రాతిని కౌగిలించుకున్నట్టు ఉంది. రామేశ్వర్ గోవింద్ కథ వింటున్నాడు. వింటూ ఉంటే హృదయంలో ఎక్కడో మెలిక పెట్టేసినట్టయింది. ఆ చల్లని రాత్రిలో కూడా అతని శరీరం మండుతున్నట్టు అనిపించింది. అతడు కూడా దుఃఖితుడే. ఆ దుఃఖమే ఇద్దర్నీ దగ్గరికి చేర్చింది. ఇద్దరికీ దాచుకోవలసినదేమీ లేదు. ఎన్నోసార్లు చెప్పుకున్నారు. కాని, ఈ రోజు వారి దుఃఖం బయటికి వచ్చి తిరుగుతోంది. రామేశ్వర్ మౌనంగా ఉందామనుకున్నాడు. తన దుఃఖం చెప్పుకోదలుచుకోలేదు. గోవింద్‌కు తాను పూర్తిగా చెప్పలేదు. చెప్పవలసిన దింకా ఉంది. ఇంట్లో బీదతనం, నిరుద్యోగం ఇద్దరూ అనుభవించారు. కాని, [illegible] దుఃఖ గాథ రామేశ్వర్‌దే ఎక్కువగా ఉంది. ఇప్పుడు గోవింద్ పట్ల రామేశ్వర్‌కు జాలి కలగలేదు. మరో సమయం అయితే పరస్పరం ఓదార్చుకొనేవారు.

రామేశ్వర్ ఆలోచిస్తున్నాడు.

'ప్రపంచంలో ఉండే దుఃఖమంతా వీడికే ఉన్నట్టు ఏడుస్తున్నాడు. దుఃఖమంటే వీడికేం తెలుసు? నేనేదో ఆనందంగా ఉన్నాననుకొంటున్నాడు. తన ఒక్కడికే దుఃఖమున్నట్టునూ!'

"నీ వే దుఃఖమూ అనుభవించలేదు." హఠాత్తుగా అన్నాడు.

"కడుపులో మంట రేగితే, దానికి తోడుగా బయట కూడా అవమానం. అప్రతిష్ఠ వస్తే మరణంకన్నా ప్రియమైంది ఇంకొకటి ఉండదు. కాని, ఇంత జరిగీ నేను బ్రతికే ఉన్నాను. బ్రతికిన తండ్రికంటె చచ్చిన తండ్రి మేలు. మా నాన్న బ్రతికే ఉన్నాడు. నా జీతంలో సగం ఆయన మందులకూ, తాగుడుకే పోతుంది. జీవితమంతా తాగుతూనే ఉంటాడు. ఒక స్త్రీని కూడా ఉంచుకున్నాడు. ఇంటికి పోవాలంటే నా ప్రాణం వణుకుతుంది. ఎందుకో తెలుసా? కళ్ళలో ఆకలి పెట్టుకొని నా తమ్ముడు, చెల్లి నన్ను చూస్తారు. ఆ క్షణంలో ఒక్కసారి చచ్చిపోవాలనిపిస్తుంది. భయంకరమైన దరిద్రం. అంతకంటే భయంకరమైన ఆకలి. నీకు పెళ్ళికాని చెల్లెలు చింత. ఇంటి గౌరవాన్ని మట్టిపాలు చేసి లేచిపోయిన చెల్లెలికన్నా పెళ్ళికాని చెల్లెలు నయం. నా చెల్లెలు అత్తింటినించి పారిపోయింది. ఎవరితో పోయిందో, ఎక్కడికి పోయిందో తెలియదు. రెండేళ్ళు అయింది. దాని విషయమే తెలియదు. పొరుగువాళ్ళూ, బంధువులూ ఎవరూ మా ముఖం చూడరు. కాసిని నీళ్ళు కూడా ఇవ్వరు. నేను బ్రతుకుతున్నానా? లేదు. చచ్చిపోయాను. ఇది నా శవం. దీన్ని పిండే మా నాన్న తాగుతాడు. నా మాంసం తిని మా కుటుంబం ఆకలి తీర్చుకొంటుంది."

రామేశ్వర్ కాస్సేపు ఊరుకొన్నాడు. గోవింద్‌కు ఏమయిందో ఒక్కసారి లేచి దూరంగా వెళ్ళిపోయాడు. ఇప్పుడు గోవింద్‌కు రామేశ్వర్ అంటే తెలియని విచిత్రమైన అసహ్యం కలిగింది. రామేశ్వర్ తన దుఃఖ గాథ వివరించేకొద్దీ జాలి కలగకపోగా కోపం రాసాగింది.

"నేను కాబట్టి ఇంత దుఃఖం సహించాను. వేరొకడయితే ఈపాటికి వాడి బూడిద కూడా ఉండేదికాదు." రామేశ్వర్ అన్నాడు.

"ఎవరి దుఃఖం వాళ్ళకు గొప్పలే!" గోవింద్ ఒక రకమైన ఈర్ష్యా భావంతో అన్నాడు.

రామేశ్వర్‌కు కోపం వచ్చింది.

"నాలాగా అనుభవించవోయ్—తెలుస్తుంది. నా దగ్గరేముంది? అవమానం, ఆకలి, ఒక రకమైన శ్రమ, అకాల మృత్యువు. నాలో నాలుగవ వంతు కూడా నీకు లేదు."

---

**ఋజుమార్గం**

**యువకులలో జ్ఞాన తృష్ణ వారిని**
**వక్ర మార్గాన పోకుండా కాపాడుతుంది.**

— బీచర్

---

ఇద్దరికీ స్పర్ధలా సాగింది. ఇద్దరూ దుఃఖితులే. ఇద్దరూ దాన్ని గర్వంగా మోస్తుండేవారు. ఏమీ తెలియనివాడికి దుఃఖంమాత్రం కావలసినంత ఉంటుంది. దాన్ని వీరుడులా అనుభవిస్తాడు. జీవించడానికి ఏ ఆధారం లేకపోయినప్పుడు దుఃఖమే వారికి ఆధారం. దాన్నే పట్టుకు కూర్చుంటారు. దుఃఖమే గౌరవంగా భావిస్తారు. గోవింద్, రామేశ్వర్ కూడా దుఃఖాన్నే ఆధారం చేసుకొన్నారు. నాకెంతో దుఃఖం ఉందని గోవింద్ అనుకుంటే, నేను ఏమి అనుభవించినది వీడి కేమి తెలుసునని రామేశ్వర్ అనుకొన్నాడు. ఈరోజు రామేశ్వర్ అంతా చెప్పేశాడు. గోవింద్ నెత్తిమీది కిరీటాన్ని లాక్కొని తనమీద పెట్టుకొన్నట్టే దెబ్బ తీశాడు.

రామేశ్వర్ అంటే గోవింద్‌కు కక్ష ఏర్పడింది. ఇంతవరకు తాను తన శత్రువుతో కంబళిలో పడుకొంటున్నట్టు తోచింది. తన శక్తి అంతా పోయినట్టయింది.

"ఈ అయిదారు నెలల్లో నేను పొందిన దుఃఖం నీవు రెండు జన్మల్లో కూడా అనుభవించలేవు" అన్నాడు రామేశ్వర్.

గోవింద్ ఒక్కసారి కంబళి విసిరికొట్టాడు. గోవింద్‌కు కోపం, అసహ్యం ముంచుకు వచ్చాయి. తన దుఃఖ కిరీటాన్ని ధరించి తన శత్రువు తననే ఎగతాళి చేస్తున్నాడు. "వెధవా! దుఃఖంలో కూడా నీవు నన్ను మించిపోయావు. గర్వించేందుకు నా దగ్గర దుఃఖం తప్ప ఇంకేమి ఉండేంది? నీవు నా ఆరోగ్యాన్ని కూడా లాక్కోవాలనుకొంటున్నావురా." క్రోధంగా అన్నాడు గోవింద్. ఆగకుండా దబ దబ రామేశ్వర్‌ను పట్టి నాలుగు తాపులు తన్నాడు. అలిసిపోయాడు. కూర్చున్నాడు. ఘొల్లుమని ఏడ్చేశాడు.

రామేశ్వర్ తన్నులు సహించాడు. అడ్డు పెట్టలేదు. తన కిరీటంలో కొత్త వజ్రాలు పొదగబోతున్నంత ప్రసన్నంగా ఉన్నాడు. ★